కథానిక

# అపవాదు

"గోపి"

నిండు యవ్వనంలో తియ్యని భావాల బరువుతో తలవంచుకున్న పెండ్లికూతుర్లా ఉన్నాయి పంటకివచ్చిన చేలు. కోతల హడావుడి. పండుగపిలుపులసందడి. సరదాలకి దోహదమిచ్చేది పైసా. పైసా మెరిగే రోజులు పండగ రోజులు, రైతుజనాలకి.

చల్లని వెన్నెల. చలికి చీరని ఒంటినిండాకట్టుకుని, కీనీడలో ఉన్న సరుకు కనబడేట్టు, బుడ్డీ దీపం కొంచం ముందుకుతోచింది సీత. వెంకటి తయారయ్యాడు—

"చూడే అమ్మా! ఏనాక్కొట్టేశాడో తవుడు గాడు,"అని బుర్రమీద బుగ్గి దవడమీద దెబ్బ చూపించాడు.

"ఊరుకోరయ్యా"అని ఓదార్చింది సీత.

"ఊరుకోయేటే? నిన్నేటిచేస్తానో సూడు అని నాను శతాయిస్తే,

"నీ బాబుతో సెప్పుకోరా"అన్నాడే తవుడుగాడు. 'ఆడి బాబుంతేనా సెప్పుకోడానికి'అని అంతా నవ్వేరే."అని బావురుమన్నాడు. వెంకటి.

"ఒల్లకోరయ్యా, నేకూకలేస్తాలే"అని నెమ్మదిగా, "నెయ్యుండ తింటావురా?" అని ఒక నెయ్యుండ వెంకటిచేతులో పెట్టి దుకాణం సర్దేసింది. వేరుశనక్కాయలబుట్ట, సూలుండలు వెంకటిచేతికిచ్చి బుడ్డీ, సామాన్లు పేర్చే బల్లమీద సిగరెట్లు, చుట్టలు, మిగతా సామానులు పేర్చిన పెద్ద బుట్టపెట్టి, నెత్తిని పెట్టుకుని, ఇంటికి యలుదేరింది.

ఇంటికిపోతూ మళ్ళా ఆలోచనల్లోపడింది, సరిగ్గా ఆరేళ్ళక్రిందటిమాట. తొలిసారి అత్తింటినించి, కన్నోరింటికి వచ్చినప్పుడు—

"పిన్నమ్మా! ఎల్లొత్తానే" అని చెప్పింది పక్కింటి ఈరమ్మతో.

"మాయమ్మే! ఎల్లిరాయె చిరాల. అత్తకాలం మళ్ళిందోయా ఒంటిదాయి. ఏటి సేస్తాది ఇంటికాడ"అని అంపకరం పెట్టింది.

"మాఁవా ఎల్లొత్తానూ" అని శలవు చెప్పింది భర్త అప్పన్నతో, ఊరవతలదాకా అంపకం పెట్టడానికి వస్తే.

"ఎప్పుడూ?" అని అడిగాడు అప్పుడు, మెల్లిగా.

"నువ్వెప్పుడు పిలుపుకొత్తే అప్పుడే!" అని జవాబిచ్చింది సీత, 'ఎడబాటు ఎల్లాభరించడమో' అన్న దిగులుతోకూడా.

ఒక్క అత్త అసిరమ్మమాత్రం కంట్లో కారం పెట్టుకున్నట్లు కొరకొర చూచింది. "ఎల్లొత్తానత్తా"అని చెప్పి ఆమె పాదాలకి మొక్కితే...

ఆలోచనల్ని విదిలించి "బువ్వేస్తాను రారా వెంకటీ" అని పిలిచి కంచం పెట్టింది. "ఏటే ఆలోచిస్తున్నావు?" అని అడిగాడు వెంకటి భోజనంచేస్తూ. కుర్రాణ్ణి నవ్వించాలని, "మైన పోళ్ళ బొట్టెని నీకడుగుదామనిరా"అన్నది సీత. "శా అదేటే"అని సిగ్గు, సంబరాలతో విప్పారిన వెంకటి ముఖంలో అప్పటి ముద్ర స్పష్టంగాచూడగల్గింది... 'అప్పుడోసారివచ్చి, బొట్టెణ్ణిచూచుకుంటే, ఇన్నిమాటలొస్తాయా"అనుకుంది అమాయకంగా. అన్నం తిన్నాక వెంకటి హాయిగా నిద్రపోయాడు. కాని సీతమాత్రం నిద్రపోలేకపోయింది. పండగరోజుల్లో సీత ఎప్పుడూ అంతే! "సీతమ్మతల్లిపేరెట్టుకున్నోళ్ళు ఎవరు సుఖబడ్డారు గనక,"అనుకుంది.

సీత, మేకల గొల్లల ఇంటిబిడ్డ. తండ్రి గురయ్యకి మేకలమంద, రెండుమళ్ళు పల్లం వ్యవసాయం, కాస్తోకూస్తో నగదుకూడా ఉండేవి. గురయ్యకు సీతకన్న పెద్దవాళ్లు ఇద్దరు ఆడపిల్లలున్నారు. గురయ్య స్థితిగతులు చూచి, మోజుగా బంగారంపెట్టి పెండ్లిచేసుకున్నారు. పెద్దకుటుంబాల్లోవాళ్లు. సీతకి పెండ్లిఈడువచ్చేసరికి కరువు వచ్చింది. మంద దెబ్బతిన్నది. పల్లంమళ్ళు కాస్తా

అమ్మోవల్సి వచ్చింది. పెద్దకుటుంబం వాళ్ళు అడగరాలేదు. చిన్నసంసారులు "ఏమంటారో" అని ఊరుకున్నారు. బాగా ఈడొచ్చేవరకూ ఉండింది సీత.

మారిన పరిస్థితుల్ని వెంటనే గ్రహించింది, తల్లిదండ్రుల కన్నింటిలోనూ సహాయంచేయడమే కాకుండా ఇరుగు పొరుగు వారికి సాయపడుతూ తల్లోనాలికలా మెసిలేది. పెద్దమనిషైంది. రోజూ చూస్తూన్న మేఘాలు, కొండలు, చెరువులు, జంటలుగా పోతున్న పక్షులు, కొత్తగాను అందముగాను కనిపించేవి. వసంతరుతువులో చుక్కాకు కూడవెయ్యటానికి వెళ్ళేటప్పుడు ప్రకృతిలో లీనమైపోయేది. ఆ మైకంలో ఏదన్నాపదం విసిరిందంటే దారంట పోతూన్నవాళ్ళుకూడా ఆగి వినిపోయేవారు ఆమె తేనెల స్వరాన్ని.

అప్పన్న పొరుగూరునుంచి మేకల్ని కొనుక్కుపోతూ సీతగొంతుక విన్నాడు. ముచ్చటపడి 'ఎవరిబొట్టె? ఏటిసంగతి?' అని కనుక్కునేటప్పటికి 'గురయ్య కూతురు, కన్యపడుచుసీత' అని చెప్పారు. తల్లి అసిరమ్మతో చాలా నేర్పుగా ప్రవర్తించి సీతనడగ వెళ్ళాడు. రాకరాక కలిసివచ్చిన సంబంధం. "ఈడొచ్చిన పిల్లకదా ఏటంటాదో"అని అడిగాడు గురయ్య. "అమ్మా ఏటంటావే?" అని. అప్పడినికూడా చూచింది సీత ఆకు కూడేసుకుంటూనే. ఆ కీవి అమాయికపు చూపులు బాగానచ్చాయి. తల్లీతండ్రీ అప్పటికే చాలావిచారంగా ఉన్నారు. "కడసారి బొట్టెకు పెళ్ళి కానేదని"...కాని తల్లితోకూడా నీళ్లు తెచ్చుకుందికి వెళ్లినప్పుడు విన్న మాటలవల్ల భయంకలగకపోలేదు...

"ఎంకమ్మొదినా! ఏటో పట్టోళ్ళ బొట్టెడికి అడగొచ్చినారట మీ యమ్మిని" అని అడిగింది లచ్చమ్మ.

"మరేనమ్మా అడగొచ్చినారే" అని ఎంకమ్మ జబాబిచ్చింది.

"మరేటి సెప్పినారే?"అని అడిగింది నూకమ్మ.

"ఏటిసెప్పడమే ముందునుయ్యి, ఎనక్కిగొయ్యి. మూడేళ్లైంది ఎత్తురాలై. కలిసొచ్చింది ఒకటీ లేదు. ఇంతకీ అప్పడు మంచోడు కాని అసిరమ్మ మా కానిదోయట, ఏటీ తోచకుండా వుండే" అంది వెంకమ్మ.

"పిన్నమ్మా! కోపంతెచ్చుకోవు కద ఓమాటంటే! నీకూతుర్నిడుతాడే ఆ అసిరమ్మ. మేమో పాలి ఇళ్ళచూపుల కెళ్లినప్పుడు దానిబాగోతమంతా చూచినాం కాదే!" అని అసిరమ్మ గురించి తెలిసినదంతా వెళ్ళబోసింది సంగమ్మ.

"పిల్లోడు మంచోడైతే అదేటి చేస్తాదే"అని సాగదీసింది తలుపులు. "తల్లో నాలిక తిన్నగా తిరిగితే అత్తేటి చేస్తాది"అనుకుందిసీత. "ఏటంటావే అమ్మా" అని గురయ్యడిగితే "బయ్యమేంలేదు సెయ్యిబాబూ"అని దన్నిచ్చింది సీత.

ఇదంతా ఒక్కసారిగా సినీమా తిరిగింది సీత కళ్ళముందు. అత్త దగ్గిర బహు అణకువగాను, మర్యాదగాను మెసిలేది. ఐనా తిప్పలు తప్పలేదు. ఎన్నిబాధలు పెట్టినా అప్పడిమొహం చూడగానే మరచిపోయీదవన్నీ కూడా. ఎప్పుడూ అప్పడితో చెప్పికూడా ఎరగదు. ఇరుగు పొరుగు వాళ్ళకి సీతంటే ప్రాణం. అత్తింటి కాపురంలో సీత మెప్పుపొందడాని కేమివ్వగలదు? చల్లని నవ్వు, కమ్మనిమాట, ఒకమంచిమాట; వీటికోసమే వాచిపోయీవారు ఇరుగు పొరుగువారు. పెళ్ళి మాటలు ఏవన్నావస్తే 'మేం సాయంవరం చేసుకున్నాం' అని గర్వంగా చెప్పేది ఎవరితోనైనా! అప్పడికి మరోలోకమేలేదు సీత తప్ప...."ఒక్క నాలుగునెల్లలో మారిపోయాడా?" అన్న ప్రశ్న సీతనిచాలా బాధించింది. కాని నమ్మలేదు. "ఎప్పటికన్నా అప్పడు తనవాడే" అన్న పట్టుదలతో ఉంది......మొదటిపండుగ; ఎంతచితికిన సంసారం ఐనా గొప్పగా చెయ్యాలనుకున్నాడు గురయ్య. సీతబోగినాడు, సంకరమాణంనాడు కూడా చూచింది అప్పడికోసం. రాత్రల్లా ఏడ్చిఏడ్చి నిద్రపోయింది. మర్నాడు "ముసలిదాయి కేటొచ్చిందో" అని ఓదార్చుకుంది. తరువాత ఎవరూ పిలుపుకేనా రాలేదు. దొంగతనంగా ఒకవుత్తరంకూడా రాయించింది అప్పడికి. దాంట్లో "అత్తింటినించి వచ్చాక బయటపడలేదు" అనికూడా వ్రాయించింది. జబాబన్నా వస్తుందేమోనని మరోనెల చూచింది. సరి ఏదో ముప్పొచ్చిందని బెంగపెట్టుకుంది, రాకపోగానే.

గురయ్య మంచం మీదనుంచి దిగలేని స్థితి. అట్టే కాలం బతకడని కూడా గ్రహించాడు, "చిన్నమ్మి కాపరం సద్దుసెయ్యమని" రామస్వామి తాతని ప్రార్థించాడు. రామస్వామి గొర్రెల్ని మందాయడం, మారువర్తకం చెయ్యడం చేస్తాడు. కోనాంపేట సంతపని పూర్తిచేసుకుని, పట్నోళ్ళింటికి రాయబారం వెళ్ళాడు. రామస్వామికి భారత భాగవతాదికథలన్నీ వచ్చు. ఆమాటా ఈమాటా చెబుతూ, "కిష్టభగవానుడే రాయబారం సెయ్యలేక పోనాడు. నానోలెక్కా" అంటూ "సీతమ్మని పిలుచుకొపోనేదేం?" అని యుక్తియుక్తంగా అడిగాడు. అడగడమే తడవుగా అసిరమ్మ నోరు కడుక్కొని తిట్టడం ప్రారంభించింది. "జాతక్కువదోయి మాయింటికెలా వస్తాది" అని ఒక అపవాదు పారేసింది సీత మీద. "సీతమ్మతల్లి మహాతల్లి, ఆ తల్లి సమానము మా సీత. ఆ బొట్టినంటె కళ్లు పోతాయి. తప్పుడు మాటలు రానియ్యక" అని మందలించిన రామస్వామి వాక్యాలు ఆమెని మరీ రెచ్చకొట్టాయి. సివాలెత్తినట్లు ఊగి,మరీ తిట్టడం మొదలెట్టింది. చుట్టుపక్కల వాళ్ళు అసిరమ్మ నోట్లో నోరు పెట్టరు. కాని సీత విషయం కాబట్టి ప్రత్యేకంగా కలుగచేసుకుని చెప్పాలని చూచారు కాని లాభంలేకపోయింది. అప్పుడు ఇదంతా అర్థంకాక చేసేదిలేక నోరుమూసుక్కూర్చున్నాడు.

రామస్వామి తిరిగివచ్చి ఈ విషయం జరిగింది జరిగినట్లుగాచెప్పి తగువుచెయ్యమన్నాడు మనోవర్తికి. తలుపుచాటునుంచి వింటూన్న సీత గభాలున వచ్చి, "తగువు పెట్టొద్దు. ఇలాగేఉంటాను; ఉండనిమని" తండ్రి కాళ్ళుపట్టుకు బతిమాలింది.

గురయ్య చనిపోయాడు, వెంకమ్మ చనిపోయింది. పూరికొంప, రెండు మేకలు, పసివాడు వెంకటి ఇవి సీత ఆస్తి. రెక్కలకష్టంమీద గడుపుకొస్తూంది రోజూ. రెండేళ్ళుపోయాక కులంవారిలో గుసగుసలు బయల్దేరాయి. ఒకనాడు పెద్దప్పమ్మ అడిగింది, "ఏటో నువ్వే అప్పడికి బెమిసినట్టు కూకుంటూవు. తగువుచేసి తెగతెంపులు చేసుకుని' మరోమనువుకి పోరాదే. మనకేటి మారుమనువు జాతి" అని సలహా ఇచ్చింది. సీతమనస్సు చివుక్కుమంది. కులమువాళ్ళకెదురు చెప్పదుగా, "అమ్మా! బొట్టెట్టేటి సెయ్యమన్నావే?" అని అడిగింది.

"నాకాడ ఇడేయ్యే. ఆడికేటి నోటు?" అంది అప్పమ్మ.

అప్పమ్మది బంగారంలాంటి మనస్సు. కాని పాతకాలం. అందుకని కంటినీరు పెట్టుకుని అప్పడి మీద తనకున్న ప్రేమని, నమ్మకాన్ని వెలిబుచ్చి "ఎప్పటికైనా అప్పడు వస్తాడు. ఈ విషయం ఎవ్వరికీ చెప్పకు. చెప్పితే లొక్కువ కడతారు." అని చెప్పి. అప్పమ్మచేత ప్రమాణంకూడా చేయించుకుంది. కులంవాళ్ళకేం చెప్పిందో మళ్ళా ఆ వూసెత్తలేదెవ్వరూ.

కోతలు, ఊడుపులూ చేస్తూ, రోడ్డుప్రక్కదుకాణం చూచుకుంటూంటే ఆలోచించడానికి కూడా తీరుబాటుండేదికాదు. కారణం ఏదైనా సీతదగ్గర చాలామంది కొనేవాళ్లు. తుంటరులు సాయంకాలం పిదన్నాకొని హాస్యమాడితే, విన్న



ట్టుగా ఊరుకునేది, మనసులో బాధపడ్డా. పండగ ముందు ధాన్యంగింజలు కూడేసేది, అమ్మినవాటికి గాను. ఆ రోఏడు రాగానే, వెంకటిని మందకాపు రామస్వామి వెనకాతలపంపేది. వచ్చీరానిజ్ఞానంలో ఉన్న పిల్లాడివిషయమే యెప్పుడూ ఆలోచన. పిల్లలు ఆటల్లో వెంకటిని యేడిపించడం, ఎత్తిపొడుపు మాటలనడం, వెంకటి ఏడుస్తూ ఒకటి రెండుసార్లు ఇంటికి రావడం కూడా జరిగింది. వెంకటికి ఈ పరిస్థితి ఎలా చెప్పడమో అర్థకాక తికమకలు పడింది. తగువు పెట్టి, కేకలువెయ్యడం గుట్టుగా ఉన్న బ్రతుకు నట్టింటికీడ్వడం అని బాగా తెలుసు. వెంకటి అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పలేక ఉదాసీనంగా ఊరుకునేది...

ఈ ఆలోచనలతో రాత్రంతా నిద్దరలేదు. తల తిరగడం ఆరంభించింది. చిన్న కునుకు పడుతూందనగా "కూడెయ్యవే, మేకల్ని తోలుకెల్తా"నని వెంకటి లేపేశాడు...చల్లంది తిని "నిన్నటి రోజెక్కడో" మరిచిపోయి తోటివాళ్ళతో తన చిన్న మందని తోలుకెళ్ళాడు. గొర్రెలు మేస్తూంటే, ఆటలకు దిగేరు. కోతి పిల్లీల కథ్థి, డూడూ ఆట ఐంది. గోణే బిళ్ళా ఆడుతున్నారు. నూకాలు దొంగయ్యాడు. అందరికీ ఆట పెట్టేడు. బాగా అలిసిపోయాడు. వెంకటి వంతు వచ్చింది. పారిపోబోయాడు నూకాలు. వెంకటి నూకాలు రెక్క పట్టుకుని, "నా ఆ టెట్టు" అని గట్టిగా అడిగాడు. "ఎట్టను నీ బాబుతో చెప్పుకో" అని చెయి ఝాడించి విడిపించుకున్నాడు. అంతా నవ్వేరు. "ఆటా పెట్టడు పాటా పెట్టడు మంగలి రాముడి కొడుకు, మంగలి రాముడి కొడుకు" అని పాట పాడేరు. నూకాలికి రోషం వచ్చి తిరిగి, "ఎవడ్రా మంగలి రాముడి కొడుకు జాత్తక్కువోడా" అని ఎదురు తిరిగాడు. "ఎవడు నా ఆట పెట్టడో ఆడు" అన్నాడు వెంకటి. దానిమీద, నూకాలు వెంకటి దవడమీద 'ఫెడీ' మని వేసేడు. వెంకటి తిరగబడ్డాడు. కాని తక్కిన వాళ్ళంతా కలిసి వెంకటిని మొత్తేసి, నానా మాటలు అన్నారు. ఏడుస్తూ యింటికి తిరిగొస్తూంటే "ఈడమ్మని ఈడి బాబందుకే ఒగ్గేసేడురా" అని ఏడిపించారు.

రామస్వామి మంద ఆచిన పొలమునకు వెళ్లుతూ, వెంకటిని చూచి ఏందలా ఏడుత్తావురా ఎంకటీ" అని అడిగి, సమాచారం తెలుసుకుని, చేతికి కజ్జపుండ ఇచ్చి "అమ్మో తిండెట్టే ఎంకటిని మందకాడికి కాపు తీసుకెల్తాను" అన్నాడు. రామస్వామి తాతతో వెళ్ళడమంటే వెంకటికి సరదాయే. తినడాని కేదో ఇస్తాడు. కథలు చెబుతాడు. బయటికి పోతే ఇదీ అదీ చూస్తూ అన్నీ మరిచిపోవచ్చు. ఇంత తిని రామస్వామి వెనకపడ్డాడు. రామస్వామి కాళీ మర్దనం కథ ప్రారంభించాడు. కాళింది, పాము, క్రిష్ణుణ్ణి పట్టుకోవడం వింటూంటే వెంకటికి అప్పుడు జరిగినట్టనిపించింది. "తాతా! పాము పడితే సవ్వనేదూ కిత్తయ్య" అని అడిగితే, "దేవుడ్రా సవ్వడమేటి?" అన్నాడు. "కిత్తయ్యకి బాబెవడు?" అని మళ్ళా అడిగితే, "కిత్తయ్యే అందరికీ బాబురా అతడికి బాబేటి?" అని సమాధాన మిచ్చాడు, కుర్రాడి మనస్సులో విషయం గ్రహించినట్లుగా.

మందాచిన పొలందగ్గర కొచ్చి, అంతవరకూ కాపలా ఉన్నవాళ్ళని ఇళ్ళకు పంపించేడు రామస్వామి. అప్పటికప్పుడే సద్దుగాఉంది. మంద కుక్కల అరుపు. నక్కల కూతలు, గుడ్లగూబల ధ్వని. ఇవి తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. తాత అటూఇటూ తిరిగి ఒళ్లు వాల్చేడు. ఇద్దరు ముగ్గురు మరోచోట కూర్చుని కునుకుతూన్నారు. రామస్వామి వెంకటికూడా వాళ్ళతోనే ఉన్నాడని అనుకున్నాడు. వెంకటికి భయం తక్కువ. చీకటిలో అటూఇటూ పచార్లుచేసి, ఆలోచిస్తూ మడిగట్టుమీద వాలేడు. తలకి చుట్టిన గావంచా పరుచుకుని.

ఆ రోజున ఆటలో జరిగిన జట్టీ, తాత చెప్పిన కథ వీటినిగురించి ఆలోచన "ఇన్ని నక్షత్రాలున్నాయి కదా ఈటికి బాబెవడో?"...అనుకున్నాడు మీదికిచూచి. కిష్టయ్యకు అంతే సాహసం ఎలా వచ్చిందో?" అవి సాగుతూండగానే ఒళ్ళు మరిచి నిద్దరపోయాడు. కూర్చుని కునుకుతూన్నవాళ్ళు ఇంకా అలాగే కునుకుతూన్నారు. గొర్రెలు నెమరవేస్తూ విశ్రాంతి తీసుకుంటున్నాయి. మంద కుక్కలు ముందుకాళ్లు చాచి, తల మధ్యగా పెట్టుకుని సగం కళ్లు

మూల్గుతున్నాయి. నిశబ్దం భయం కొల్పుతూంది. నడిరేయి దాటింది.

అది కొండవారప్రాంతం. పల్లంమళ్ళు పెద్ద చెరువు. దిగువన ఉన్నాయి. ఆ చెరువులో నీళ్లు జాస్తిగా ఉండడాన్నే మెట్టు వ్యవసాయంకూడా చెయ్యడానికి మంథాపిస్తున్నారు రయితులు. మందలో అలజడి కలిగింది. గొఱ్ఱెలు వరసగా, బేమేం అని అరుపులు, మందకుక్కల బౌ, బౌ మొరుగులు, మేకలు గొఱ్ఱెలు ఇటునుండి అటు అటునుండి ఇటూ పరుగులు, పరుగెత్తుతూన్న మంద చేర్చేందుకు కుక్కల అరుపులు, ఈ విధంగా మందంతా కల్లోలంగా ఉంది. రామస్వామి లేచి నలుదిక్కులూ చూచేడు. జంతువ సమీపంగా ఉన్నట్లు అచోకీకట్టాడు. పరిగెత్తుతూన్న మేకల్ని మరలించడానికి, "సిమ్మా. ఓరి లింగూ" అంటూ పిలిచాడు. తాను కఱ్ఱకొట్టుకుంటూ పోయాడు ఆ వైపు.

ఇంకా పదడుగుల మేర వెళ్ళేడు ఆ చీకట్లో ఇంతలో "ఓలమ్మ నాయినో! సిందవరా తాతా" అన్న కేక వినబడ్డమే వెంకటి ఉన్న వేపు పరిగెత్తాడురామస్వామి. వచ్చిచూచేసరికి వెంకటిమీద కూర్చునివుంది. నలుగురూ పోగై కేకలువేసేసరికి సిందవ దౌడుకొట్టింది. కాని వెంకటికి తెలివి లేదు. ముఖంనిండా నెత్తురుమయం. భయం కొల్పుతూంది దృశ్యం. మందకాపుకై ఇద్దర్ని వదిలి తక్కినవాళ్లు అక్కళ్ళపేటుచేర్చారు వెంకటిని.

తెల్లవారింది. సీత కడవపట్టుకుని తలుపు తీసింది, నీళ్ళు తేవడానికి. నీళ్ళ ఎద్దడి. కొంచెం దూరంగాఉన్న నూతినుండి తేవాలి నీరు. తలుపు తీసేసరిక్కి రామస్వామి మరి నలుగురు వెంకట్ని తెచ్చి వాకిట్లో పడవేయడం సీతచూచి, "ఏవిటి తాతా అది" అని అడిగింది.

"మరేటిసీతా, నీకొంపే మునిగింది" అన్నాడు లింగం. కడవామూల పారేసి వెంకటి దగ్గరకి పోయేసరికి నెత్తురుకారుతూన్న వెంకటినిచూచి నెత్తీనోరూ మొత్తుకుంది.

"ఓలమ్మో! ఓరినాయనో! ఏటొచ్చిందిరా, నేనన్నా చచ్చిపోయాను కానురా" అంటూ ఏడ్చింది.

"ఎంతపనై పోనాదిరా" అని ఒకడంటే "ముండ దేవుడు సీతకేతేవాలా ఈకష్టం" అని ఒకడు.

"సావు సావు అంటే ఎంతరా?" అని మరోడు జరిగినదానిమీద సానుభూతి చూపిస్తున్నారు.

"గురయ్యగారి ఇల్లు ఇదేనా?" కనబడీ కనబడని వెల్తురులో వెతుక్కుంటూ వచ్చాడో వ్యక్తి. భుజముమీద పచ్చడం, నెత్తిమీదపాగా. ఒకచేతికి బేండేజీ చుట్టివుంది. "ఏవూరన్నాడు" ఒకడు. "ఏంటికావాలి?" అని ఇంకోడు అడిగాడు. గోడకుచారబడిన రామస్వామి ముందుకు వచ్చి, దగ్గరగాచూచి "నువ్వురా అప్పన్నా, ఓరెంతపనై పోనాదిరా?" అని గద్గదస్వరంతో అనేసరికి సీతకేదో ప్రమాదం జరిగిపోయిందనుకున్నాడు. చేయివిరిగి బెజవాడ ఆసుపత్రిలో 15రోజులుమంచంమీద ఉన్నప్పుడు ప్రాణంతో బయటపడితే 'సీతదగ్గరకువచ్చి తనతప్పు ఒప్పుకొని తిరిగి ఏలుకోమని బ్రతిమాలాలని నిశ్చయించుకున్నాడు. "సీత ఏమైపోనాదిరా సిన్నబాబూ" అన్నాడు మెల్లిగా.

"ఓసి సీతకాదురా. అవిగాదురా సీత! నీకొడుక్కురా" అన్నాడు లింగం.

వెంకటి కడప్రాణాలతో 'దాహం' అని నోరు చూపించాడు. జ్వరం తీవ్రంగావచ్చింది. నీరుతాగి.

"నూకా! మా బాబొచ్చాడురా, నీపనిచెప్తా ఉండు" అని కలవరించాడు. వెంకటికి ఒకపక్క సీత, రెండోపక్క అప్పన్న కూర్చుని, నాటు వైద్యుడిచ్చిన మందుని పూయడం మొదలెట్టారు.

"నూడుబాబూ! ఇంకా బాబులేనోణ్ణని ఎక్కిరిస్తారాళ్ళు" అని మళ్లా కలవరించి, సీతది, అప్పన్నది రెండుచేతులు గట్టిగా పట్టుకున్నాడు. ఓదార్పుమాటలు ఇద్దరూ ఎన్నో అన్నారు. అప్పన్న తన క్రూరత్వాన్ని తిట్టుకున్నాడు. ఏదో సంగ్రామంలో విజయంపొందినట్టు నవ్వేసి, ఇద్దరి చేతులనీ తన గుండెమీద పెట్టుకుని, కళ్ళు మూసేశాడు వెంకటి. ఆ మూయడం మరి తెరవ లేదు.